ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, మార్చి 1: ఆదర్శ పాఠశాలల్లో ఆరోతరగతిలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'జిల్లాలో 13 ఆదర్శ పాఠశాలలకుగానూ ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాం. బీసీ, ఓసీలు రూ.150,. ఎస్సీ, ఎస్టీలు రూ.75 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలి. ఓసీ, బీసీలకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 30 మార్కుల అర్హతతో, మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయి. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 3 నుంచి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి' అని డీఈవో సూచించారు.

ఓడించేందుకు వీళ్లు సిద్ధం

- అభ్యర్థులలో దాదాపు మార్పులేదని చెప్పిన సీఎం
- జిల్లా వైసీపీలో తారాస్థాయికి వర్గపోరు
- టీడీపీ, జనసేన కూటమిలో జోష్



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికలకు 'సిద్ధం' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షాలకు సవాల్ విసురుతున్నారు. కాగా వైసీపీ అభ్యర్థులను ఓడించేందుకు సొంత పార్టీ నాయకులే 'సిద్ధం' అన్నట్టు పరిణామాలు మారిపోయాయి. నియోజకవర్గ కో ఆర్డినేటర్లే అభ్యర్థులని.. దాదాపు మరి మార్పు లేదని ఇటీవల ఓ సభలో జగన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంతమంది నేతల్లో టికెట్ దక్కడం లేదనే అసంతృప్తి, మరికొంతమంది నేతల మధ్య వర్గపోరుతో వైసీపీ పరిస్థితి విచిత్రంగా మారిపోయింది. 2019లో ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనపై అన్నివర్గాల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరో వైపు పార్టీ నాయకుల తీరుపై ద్వితీయ స్థాయి నేతలకు వెగటు పుట్టేసింది. 'ఈ ఎమ్మెల్యే మాకొద్దు' అంటూ బహిరంగంగానే నేతలు, కార్యకర్తలు సభలు పెట్టి మరీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో డిప్యూటీ మాజీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌పై కూడా ఆ పార్టీ నాయకులు తిరుగుబావుటా ఎగురవేశారు. అంతకుముందు నుంచీ ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరిపోయింది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్పు చేస్తారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊహించారు. పార్టీ ప్రకటించే జాబితా కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. కాగా.. అభ్యర్థులు దాదాపుగా ఇప్పుడున్నవారే అని సీఎం స్పష్టత నిచ్చారు. దీంతో సిట్టింగ్‌లను మార్చకపోతే.. ఓడించేందుకు మేం సిద్ధం అన్నట్టు అసంతృప్తి నాయకులు, సంబంధిత వర్గం నిర్ణయానికి వచ్చేసింది.

● ఎచ్చెర్లలో తీసికట్టుగా పార్టీ

జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో మాత్రమే 'గడప గడపకు ప్రభుత్వం' కార్యక్రమంలో నిలదీతల పర్వం ఆరంభమైంది. ఆ తర్వాత వైసీపీ నాయకుల మధ్య అసంతృప్తి, వర్గపోరు బయటపడింది. ఇక్కడ 'ఎమ్మెల్యే వద్దు.. జగన్ ముద్దు' అంటూ ర్యాలీలు.. జిల్లాకేంద్రంలోనూ నిరసనలు చేపట్టారు. ఇటీవల ఎచ్చెర్లలో వైసీపీ నాయకుడిపై హత్యాయత్నం జరగ్గా.. ఈకేసులో సొంత పార్టీనేతలపైనే అభియోగాలు.. ఆరోపణలు వచ్చాయి. పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో అక్కడి పార్టీ పరిస్థితి మరీ తీసికట్టుగా అయిపోయింది. విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడిని ఇక్కడ నుంచి బరిలో దించినా ఓటమి తప్పదని.. ఉన్నవారితోనే నెట్టుకొద్దామన్న భావనలో అధిష్ఠానం ఉంది. ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో గెలుపుపై ఆశలు వదులుకున్నట్లుగా పరిస్థితి ఉంది. టెక్కలిలో టీడీపీకి మెజార్టీ తగ్గించాలన్నదే వైసీపీ తపనగా కనిపిస్తోంది.



● జోరు పెంచిన టీడీపీ-జనసేన

టీడీపీ-జనసేన కూటమి జోరు పెంచింది. తొలినుంచీ టీడీపీకి జిల్లా కంచుకోటే. 2019 ఎన్నికల్లో జగన్ 'ఒక్కచాన్స్' హవాలోనూ శ్రీకాకుళం పార్లమెంట్, రెండు అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసు కుంది. శ్రీకాకుళం నియోజకవర్గంలో స్వల్ప ఓట్లతేడా తో టీడీపీ ఓటమి పాలైంది. వైసీపీ పాలనలో ఎటువం టి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం టీడీపీకి మరింత ఆదరణ పెరిగింది. ఆమదాలవలస- శ్రీకాకుళం రోడ్డు పూర్తికాలేదు. పల్లె ప్రాంతాల్లోనూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వంశధార ఫేజ్-2, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు పూర్తికాలేదు. భావనపాడు పోర్టును మూలపేట పోర్టుగా మార్పుచేసినా పనులు సాగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో పంచాయతీలకు నిధుల కొరత కారణంగా అభి వృద్ధి పనులు పడకేశాయి. ఈ పరిణామాలన్నీ టీడీపీకి సానుకూలంగా మారాయి. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి.. వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్.. శంఖారావం కార్యక్రమంలో భాగంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కీలక ప్రజాప్రతినిధుల అవినీతి చిట్టాను విప్పారు. అలాగే గత నెల 26న శ్రీకాకుళంలో నిర్వహించిన 'రా.. కదలిరా' సభలోనూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వైసీపీ నేతల తీరును తూర్పారబట్టారు. ఈ రెండు సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఇదే జోష్‌తో ఎన్నికల్లో విజయబావుటా ఎగరవేసేందుకు టీడీపీ-జనసేన కూటమి సిద్ధమవుతోంది. వైసీపీలో ఇప్పుడున్న అభ్యర్థులు కొనసాగిస్తే.. తమ గెలుపు సులభమేనని ధీమాతో ఉంది.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎన్నికలపై పోలీసు, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న నిఘా వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. 'ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అములు చేయాలి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఎక్కడా మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా పటిష్ఠ నిఘా ఉంచాలి. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ తదితర అన్ని టీములు అప్రమత్తం కావాలి. చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన వివరాలను ప్రతీరోజు రిపోర్టు రూపంలో అందించాలి. ఎక్కడా సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూడాలి. సంబంధిత శాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించాల'ని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, జిల్లా అటవీ అధికారి నిషాకుమారి, డీఆర్వో ఎం.గణపతిరావు, ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి నాగరాజు, డీటీవో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



హిరమండలం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు



ప్రశాంతంగా..

- ఇంటర్ పరీక్షలు ప్రారంభం

(గుజరాతీపేట/శ్రీకాకుళం క్రైం, మార్చి 1)

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 83 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. 20,847 మంది విద్యార్థులకుగానూ 20,194 మంది హాజరయ్యారు. 653 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 15వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అన్ని కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉన్నారు. శ్రీకాకుళంలో పలు పరీక్షా కేంద్రాలను ఏఎస్పీ డా.ప్రేమ్‌కాజల్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశారు.



నరసన్నపేట: పరీక్షా కేంద్రంలో..



వజ్రపుకొత్తూరు: గోవిందపురం పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



ఇచ్ఛాపురంలో..





శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రం వద్ద ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ పర్యవేక్షణ..



శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు..

వైసీపీ పాలనలో యువతకే అధిక నష్టం

- వారి కోసం ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


అరసవల్లి, మార్చి1: రాష్ట్రంలో వైసీపీ పాలనలో అధికంగా నష్టపోయింది యువతేనని, ఈ ఐదేళ్లలో వారి కోసం ప్రభుత్వం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఒక్కో జిల్లాను ఒక రాజధానిగా అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి యువత జీవితాలను నాశనం చేశారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 7.5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తే, నేడు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక నిరుద్యోగం గల రాష్ట్రంగా తయారు చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనని అన్నారు. 'రూ.70 వేల కోట్ల అదానీ డేటా సెంటర్‌ను రాష్ట్రానికి చంద్రబాబు తీసుకువచ్చారు. అలాగే వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకువచ్చారు. కానీ, జగన్ మాఫియాకు భయపడి వారంతా వెనక్కు వెళ్లిపోయారు. లక్షలాది మంది యువత జీవితాలను నాశనం చేశారు. రాష్ట్రంలో మూడు రాజధానులంటే నిరుద్యోగ రాజధాని, డ్రగ్స్ రాజధాని, డ్రై రాజధానిగా తయారు చేసిన ఘనచరిత్ర జగన్ సంపాదించాడు. ఒక క్రిమినల్‌ని ముఖ్యమంత్రిని చేస్తే ఏం జరుగుతుందో జగన్ చేసి చూపించాడు. యువ ఓటరులారా.. ఆలోచించండి.. గత టీడీపీ ప్రభుత్వం, నేటి వైసీపీ ప్రభుత్వం పనితీరును బేరీజు వేయండి. మీ భవిష్యత్తును తీర్చిదిద్దే వారికే ఓటు వేయండి. రాష్ట్ర భవిష్యత్తుకు సహకరించండి' అని ఎంపీ పిలుపునిచ్చారు. అనంతరం ఓట్ ఫర్ బెటర్ పోస్టర్లను ఆవిష్కరించారు.

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలు ఓ కురుక్షేత్ర యుద్ధమని, ఈ యుద్ధంలో టీడీపీ(ధర్మం) గెలుపు తథ్యమన్నారు. యువత ఆలోచించి ఓటు వేయాలని, తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు. 'గత ఐదేళ్లలో యువత, నిరుద్యోగుల కోసం వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో ఆలోచించండి. మెగా డీఎస్సీ ఎక్కడ. ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ ఏదీ. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చిన స్టడీ సెంటర్లు ఏమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 16.40 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, వైసీపీ ప్రభుత్వం 10 లక్షల మందికి మాత్రమే ఇచ్చింది. 6.85 లక్షల మందికి నిరుద్యోగ భృతిని ఇచ్చాం. ఇప్పుడు నిరుద్యోగ భృతి ఏదీ. టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తాం. నిరుద్యోగులకు రూ.3వేల భృతి కల్పిస్తాం. మీ భవిష్యత్తుకు భరోసా తెలుగుదేశంతోనే. టీడీపీ, జనసేన కూటమిని ఆదరించి గెలిపించాలి.' అని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, బొనిగి భాస్కరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్సీ రమణ మాదిగ, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణంనాయుడు, రాష్ట్ర తెలుకల సాధికార సమితి డైరెక్టర్ కొమ్మనాపల్లి వెంకటరామరాజు, రాష్ట్ర జంగమ సాధికార సమితి డైరెక్టర్ విభూది సూరిబాబు, మెండ దాసునాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ నేతలు

ఏమిటీ కష్టం?



- జీడి పంటకు ఆశించిన టీ దోమ
- మాడిపోతున్న పూత
- పిందె దశలోనే రాలిపోతున్న పిక్కలు
- లబోదిబోమంటున్నరైతులు

● ఈ జీడిపూతను చూశారా? ఎలా మాడిపోయిందో. మందస మండలం గుడ్డిపద్ర గ్రామంలో సగానికి పైగా జీడిచెట్లకు ఇలాగే పూత మాడిపోయింది. పూత వచ్చిన చెట్లకు మంచు ప్రభావంతో టీ దోమ ఆశిస్తోంది. దీంతో పూతంతా మలమలా మాడిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

(హరిపురం)

జీడి రైతులను గత పదేళ్లుగా కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకపక్క వరుస తుఫాన్లతో చెట్లు నేలకొరుగుతుండగా మరోపక్క తెగుళ్ల మూలంగా దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో సగటున ఎకరానికి నాలుగు బస్తాల జీడిపప్పు దిగుబడి అయ్యేదని, ఇప్పుడు సగం కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉద్దానంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో 27వేల హెక్టార్లలో జీడిపంట సాగవుతోంది. అయితే, ఈ ఏడాది పంట ప్రారంభ దశలోనే టీ దోమ విజృంభిస్తుండడంతో జీడి పూత రాలిపోతుంది. సగానికి పైగా జీడి చెట్లకు టీ దోమ ఆశించడంతో పూతంతా మలమలా మాడిపోతోంది. అలాగే పిక్కలు మసిబారి చెట్ల కింద కుప్పలుగా రాలిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దోమ నివారణకు వారియర్, జైలో వంటి మందులు అధికంగా వాడుతున్నారు. ఈ మందులు దీర్ఘకాలికంగా పంటలపై ప్రభావం చూపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా శీతాకాలంలో పూత వస్తుంది. ఈ సమయంలో పొగమంచు విపరీతంగా కురుస్తుంది. దీనివల్లే టీ దోమ, తెల్ల దోమ, మట్టి తెగులు, బూడిద తెగులు, తేనెబంక పురుగు ఆశించి పూతదశలో పంటను నాశనం చేస్తుంది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. జిల్లాలో సుమారు 400 జీడి పరిశ్రమలు ఉన్నాయి. అయితే, జీడి దిగుబడులు తగ్గడంతో ఈ పరిశ్రమలు మూతపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు విదేశాల నుంచి పిక్కలను దిగుమతి చేసుకుంటున్నారు.

ఉద్దానం ప్రజల జీవనాడి జీడిమామిడి. గత పదేళ్లుగా తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయిన తమకు ఈ ఏడాదైనా కలిసొస్తుందని రైతులు భావించారు. కానీ, వారి ఆశలను టీ దోమ అడియాశలు చేసింది. టీ దోమ ఉధృతికి పువ్వు మాడిపోయి పిక్కరాని దుస్థితి నెలకొంది. లేత పిందె దశలోనే పిక్కసైతం నల్లగా మసిబొగ్గులా మారి రాలిపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● టీ దోమ విజృంభించడంతో జీడి పిక్కలు ఇలా నల్లగా మారి రాలిపోతున్నాయి. మందస మండలం దున్నూరులో చాలా జీడిచెట్ల కింద ఇలాంటి పిక్కలే కనిపిస్తున్నాయి. పూత పిక్కగా మారేదశలో టీ దోమ సోకి పిక్కంతా మాడి మసిబారి చెట్టుకింద రాలిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.





ఎ.బొడ్డూరు వద్ద జీడిచెట్లకు పిచికారీ చేస్తున్నరైతులు

వేల రూపాయల నష్టం



జీడి పంటకు టీ దోమ ఆశించడంతో రైతులకు వేల రూపాయల నష్టం వాటిల్లుతోంది. తితలీ తుఫాన్ అనంతరం దిగుబడులు తగ్గాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేస్తున్నాం. మందుల ధరలు సైతం పెరిగిపోయాయి. దీనివల్ల ఎకరాకు సుమారు రూ.5వేల వరకు అదనపు ఖర్చు అవుతుంది.

- జుత్తు అమ్మినాయుడు, జీడి రైతు, బిడిమి

సూచించిన మందులే వాడాలి



జీడిపంటలో టీ దోమ నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రొఫినో పాస్ మందును లీటరు నీటికి 0.6 ఎం.ఎల్, కార్బండోజిల్ 1 ఎంజీని కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో మాత్రమే వీటిని వాడాలి. వారియర్, జైలో వంటి సింథటిక్ ఫైరీ మందులను వాడితే దీర్ఘకాలం ప్రభావం చూపిస్తాయి. దీనివల్ల తెగుళ్ల మళ్లీ ఉధృతమైతే నివారణ చేయడం చాలాకష్టం. అందుకే ఈ మందులను సిఫారసు చేయడం లేదు.

- శంకర్‌దాస్, ఉద్యానవన శాఖాధికారి, మందస


సోంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


కవిటి: డి.గొనపపుట్టుగలో ఇంటింటా తిరుగుతున్న నాయకులు


ఎచ్చెర్ల: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావును కలిసిన ఎస్‌ఎంపురం టీడీపీ నాయకులు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో శుక్రవారం ముగ్గురు మృతిచెందారు. ఆమదాలవలసలో ఓ పెయింటర్ బస్సు ఢీకొని దుర్మరణం పాలవగా,బూర్జ మండలంలోని నీలంపేటజంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో కానిస్టేబుల్ మృతిచెందాడు. సోంపేట రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పెయింటర్ ..


రమణ (ఫైల్)

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని గేటు జంక్షన్ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని పెయింటర్ శెట్టి రమణ (35) మృతి చెందినట్లు ఎస్ఐ ఐ.నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఆమదాలవలస మునిసిపాలిటీలోని వెంగళరావు కాలనీకి చెందిన రమణ మార్కెట్‌కు వెళ్లడానికి గేటు ప్రాంతానికి వచ్చాడు. ఆ సమయంలో కొత్తూరు నుంచి శ్రీకాకుళంవెళ్తున్న ఆర్టీసీబస్సు గేటుప్రాంతంలో ఉన్న మలుపు తిరుగుతుండగా అకస్మాత్తుగా రమణను ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.పెయింటర్‌గా రోజువారీ కూలిపనులు చేసుకుని జీవిస్తున్న రమణకు భార్య అనురాధ, కుమారుడుఉన్నారు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని శవ పంచనామా నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

కుక్కలు అడ్డుగా రావడంతో కానిస్టేబుల్..

బూర్జ: మండలంలోని నీలంపేట జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరంలోని రామ్‌నగర్‌కాలనీలో నివాసముంటున్న కానిస్టేబుల్ కొత్తూరు సురేష్ (33) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... బూర్జ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల అనంతరం జవాబుపత్రాలను ఆమదాలవలస తరలిస్తున్నారు. ఇందులో భాగంగా పరీక్షా పత్రాలు భద్రపరచడానికి సంబంధిత శాఖాధికారులతో సురేష్ బయలుదేరాడు. నీలంపేట జంక్షన్ వద్ద తన ద్విచక్రవాహనానికి కుక్కలు అడ్డుగా రావడంతో తప్పించే క్రమంలో బోల్తాపడ్డాడు.దీంతో గాయపడిన సురేష్‌ను 108 వాహనంతో శ్రీకాకుళం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. సురేష్‌కు భార్యశిరీష, తల్లిదండ్రులు ఉన్నారు. సురేష్ మరణంతో బూర్జ స్టేషన్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. తక్కువ కాలంలోనే అందరితో పరిచయం పెంచుకుని సరదాగా ఉండేవాడని సిబ్బంది తెలిపారు.ఈ మేరకు ఎస్ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధురాలు..



కంచిలి : కంచిలిలోని సోంపేట రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఆమె వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

విద్యార్థిని ఆత్మహత్య

పొందూరు: మండలంలోని బి.కంచరాం గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న మజ్జి ఉషారాణి (17) గురువారం ఆత్మహత్యకు పాల్పడింది.ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు..ఉషారాణి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన సమయంలో ఉషారాణికి కడుపునొప్పి రావడంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి రమణ ఫిర్యాదుమేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ రవికుమార్ కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని అచ్చాపురం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గురువారం రాత్రి జాడుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. జాడుపల్లి నుంచి ద్విచక్రవాహనంపై అచ్చాపురం వెళ్తుండగా అదుపు తప్పడంతో బోల్తాపడింది. దీంతో ఆ గ్రామానికి చెందిన సవర రేవంత్,సూర్యనారాయణ గాయపడినట్లు చెప్పారు. సూర్యనారాయణకు తలకు బలమైన గాయాలుకావడంతో 108లో టెక్కలి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భవన నిర్మాణ కార్మికురాలి మృతిపై కేసు నమోదు

రేణిగుంట: నందిగాం మండలంలోని రౌతుపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు బిస్వాతి (25) మృతిపై కేసు నమోదు చేశామని రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట వినాయకనగర్‌లో భవననిర్మాణపనులు చేస్తుండగా ఇనుప కమ్మీలు విద్యుత్‌తీగలకు తగిలి స్వాతి గురువారం మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటనపై మృతురాలి భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

25 సీసీ కెమెరాల ఏర్పాటు

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నేరనియంత్రణకు సీఐ జి. ఉమామహేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఇటీవల డేఅండ్‌నైట్ కూడలిలో దొంగతనం నేపథ్యంలో నిఘా పెంచే పనిలో పడ్డారు. ఈమేరకు టూటౌన్ పరిధిలో ఇటీవల పీఎన్‌కాలనీ వాసులతో నిర్వహించిన సమావేశంలో భాగంగా ఇక్కడ భద్రత పెంచేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం పీఎన్‌కాలనీలో ప్రజలతో 25 సీసీ కెమెరాలు సిద్ధం చేయించి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేర నియంత్రణకు నిరంతర నిఘా పెంచాలన్న ఉద్దేశ్యంతో ప్రజలకు అవగాహన కల్పించి వారితో సీసీకెమెరాలు ఏర్పాటుచేయించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అవతారం తదితరులు పాల్గొన్నారు.


పీఎన్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా ఆదేశం

కలెక్టరేట్: కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లాఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలను అడిగితెలుసుకున్నారు. గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.ఎన్నికలనిర్వహణ, ఏర్పాట్లు,ఫిర్యాదుల పరిష్కారాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని,దినపత్రికల్లో వచ్చే ప్రతికూలాంశాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని,అందుకు ప్రత్యేకయంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలనిసూచించారు. కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ జిల్లాలో ఎన్నికలకు సంబంధించి తీసుకుంటున్న చర్యలనువివరించారు. ఫారం-6,7,8 దరఖాస్తులు 4,622 మాత్రమే పరిష్కరించాల్సిఉందని తెలిపారు. వివిధరకాల 356 ఫిర్యాదులురాగా వాటిని పరిష్కరించామనిచెప్పారు. ప్రతీవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిఅన్నివివరాలు తెలియజేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఈఆర్వోలు నూరుల్‌కమర్, ఎస్.భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, విద్యాసాగర్, పీఎస్ఎస్ ప్రసన్నలక్ష్మి, చిట్టిరాజు పాల్గొన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

పొందూరు: మండలంలోని కింతలిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి జిల్లా నలుమూలల నుంచి 22 జట్లు ఈపోటీల్లో పాల్గొటున్నాయి. గురువారం సాయంత్రం నుంచి రాత్రి పగలూ జరుగుతున్నాయి. శనివారం ఫైనల్ పోటీలు జరుగుతాయి.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

● తెలుగుదేశం పార్టీ నాయకులు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చోట్ల టీడీపీ నాయకులు పర్యటించారు. కార్యకర్తలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కలిశారు.

'సూపర్‌సిక్స్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి: కళా

ఎచ్చెర్ల: ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరోసారి పదవీ బాధ్యతలు స్వీకరించడంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు తెలిపారు. శుక్రవారం రాజాంలోని క్యాంప్ ఆఫీస్‌లో ఎస్‌ఎంపురానికి చెందిన టీడీపీ నేతలు కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎస్‌ఎంపురం పంచాయతీ నుంచి మంచి మెజార్టీని తీసుకు వచ్చేలా కృషిచేస్తామని మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొంటి నర్సింగరావు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సంపతిరావు గణపతిరావు, కోటి, సింహాచలం పాల్గొన్నారు.

టీడీపీకి అండగా నిలవాలి: అశోక్

సోంపేట: కళాసీ సంఘం టీడీపీకి అండగా నిలవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. శుక్రవారం సోంపేటలోని కళాసీ సంఘభవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సమయంలో కళాసీసంఘం టీడీపీకి అండగా ఉంటోందని, పార్టీ గెలుపులో ముఖ్యభూమిక పోషిస్తోందని తెలిపారు. సమావేశంలో కళాసీసంఘ అధ్యక్షుడు రెల్లలోకనాథం, తేజ, పి.దినేష్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, బీన ఆనంద్, చిత్రాడ శేఖర్ పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పన సాధ్యం

కంచిలి: మౌలిక సౌకర్యాల కల్పన టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. కంచిలి పరిధిలోని బలియాపుట్టుగ కాలనీలో రూ. 5.58లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. బీసీకాలనీలో రూ.1.5లక్షలతో ఏర్పాటుచేసిన తాగునీటి ట్యాంకును, బలియాపుట్టుగలో డ్రైనేజీ, చిన్నపాత్రపడలో చెరువు మెట్లు, పాత్రపడా, మఠం కంచిలిల్లో మంచినీటి ట్యాంకు, సీసీ రోడ్డును ప్రారంభించగా, దాకరాపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, ఎంఎం పట్నాయక్, మద్దిల కేశవరావు, ఆనంద్, భాస్కరరావు, లండ లోకనాథం, జనసేన నాయకులు క్రాంతి కుమార్, వైద్యులు సత్యం, రమణ, కె.కురయ్య పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన లక్ష్మీదేవి



ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని శుక్రవారం శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి కలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపైనా చర్చించారు. బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం, చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపైనా నిర్వహిస్తున్న ప్రచారంతీరు గురించి అచ్చెన్నకు లక్ష్మీదేవి వివరించారు. ఆమెతోపాటు గార మండల టీడీపీ ఉపాధ్యక్షుడు వెలమల శ్రీను ఉన్నారు.

'సూపర్‌సిక్స్'తో సంక్షేమం

కవిటి: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మరింత సంక్షేమం అందుతుందని ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల తెలిపారు.శుక్రవారం మండలంలోని డి.గొనపపుట్టుగ పంచాయతీలో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకుగ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రతి గడపకు ఎన్నికల హామీలను తెలియజేస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థులు బి.అశోక్, కె.రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలకు సంబంధించి కరప త్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్‌వీ రమణ, పి.కృష్ణారావు, మణిచంద్రప్రకాష్, బి.చిన్నబాబు, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

జి.సిగడాం: ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. రెడ్డీస్ ల్యాబ్ ఫౌండేషన్ ఆధునీకీకరించిన జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన వైద్యాధికారులతో మాట్లాడారు. గర్భిణులకు మెరుగైన సేవలందించడంతోపాటు సాధారణ ప్రసవాల రేటు పెంచాలన్నారు. వైద్యాధికారులు స్థానికంగా నివాసముండి సమయపాలన పాటించాలన్నారు.విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీఈవో షమిక్ త్రిపాఠీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది పీహెచ్‌సీలనుఇదే స్థాయిలో ఆధునికీకరించామని, మరో తొమ్మిది సీహెచ్‌సీల నవీనీకరణకు సిద్ధంగా ఉన్నాయన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మీసాల సత్యవతి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, పి.సోనియా, డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ ఎస్.నిర్మల, వైద్యాధికారులు బి.యశ్వంత్, పి.సుమబిందు, సీహెచ్‌వో శివప్రసాద్, రెడ్డీస్ సీనియర్ డైరెక్టర్ కేవీఎస్ఎన్ రాజు, ప్రణవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్ : యువత ఎంఎస్‌ఎంఈలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు, సర్వే అండ్ సపోర్ట్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈల ఏర్పాట్లు, సర్వే కార్య క్రమం ఈనెల 20 వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జీఎం ఉమామహేశ్వరరావు, ఏడీలు రమణారావు, రఘునాథరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు గతనెల 26 నుంచి నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ మంజీర్ జిలానీసమూన్, జేసీ ఎం.నవీన్‌తో కలిసి సంబంధిత గోడపత్రిక, కరపత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. పాఠశాలల, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

జిల్లాలో 45,869 మందికి 'విద్యాదీవెన'

జిల్లాలో 45,869 మంది తల్లుల ఖాతాల్లో రూ.35.17 కోట్లు విద్యాదీవెన పథకం కింద జమచేసినట్లు కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం బటన్ నొక్కి తల్లుల, విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమచేశారు. ఈమేరకు కలెక్టర్ నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి విశ్వమోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాల కల్పనే లక్ష్యం: పీడీ

కలెక్టరేట్: జిల్లాలోని అన్ని మండలాల్లో సిబ్బంది క్షేత్రస్థాయిలో వేతనదారులకువందరోజుల పనిదినాల కల్పనేలక్ష్యంగా విధులు నిర్వహించాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని డ్వామా కార్యాలయంలో ఏపీడీలు, అన్నిమండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఉపాధిహామీ పథకం పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఇప్పటికే 70 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు 100పనిదినాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1,16,108 మందికి వందరోజుల పనిదినాల కల్పన లక్ష్యమని,ఆ లక్ష్యాన్ని చేరుకోకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ పనిప్రదేశాల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సగటువేతనం పెరగాల్సిన అవసరం ఉందని, సగటు పనిదినాలు కూడా ఎక్కువగా ఉండేలా దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పూర్తిస్థాయిలో ఉపాధిని కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో రెండు పూటలా పనులు జరగాలన్నారు. స్థానిక జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులను గుర్తించి,అంచనాలను ఈనెలనాలుగోతేదీలోగా జిల్లా కార్యాలయానికి పంపించాలని తెలిపారు. ఉపాధి పథకం అమలుకు సంబంధించిన స్పందన కార్యక్రమంలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పర్యవేక్షణ అధికారి కేవీ అప్పలనాయుడు, ఏపీడీలు పి.రాధ, శైలజ, జి.హరిత, లోకేష్, మురళీకృష్ణ, 30 మండలాల ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యాం పాఠశాలకు ప్రసూనాంబ స్మారక అవార్డు

ఎచ్చెర్ల:కొయ్యాం జడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రయోగశాలకు డీబీఆర్‌జీ ప్రసూనాంబ స్మారక అవార్డులభించింది. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి, డీఈవో కె.వెంకటేశ్వరరావు, డీఎస్వో ఎన్.కుమార్‌స్వామి, ట్రస్ట్ అధ్యక్షుడు వీజేకే మూర్తిలు హెచ్ఎంజి.దయానందకుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు బి.లక్ష్మీనారాయణకుఅవార్డును అందజేశారు. అవార్డుతోపాటు రూ.10 వేలు అందజేశారు. అలాగే పాఠశాల ప్రతిభను ప్రశంసించి ఆర్జేడీ మరో 10 వేలు అందజేశారు.

15లోగా పన్ను వసూళ్లు పూర్తిచేయండి

●శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా


మాట్లాడుతున్న తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం అర్బన్: ప్రజలు వడ్డీ మినహాయింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 15లోగా పన్నులను చెల్లించేలా అధికారులుచర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం నగరపాలక కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోసచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో పన్ను చెల్లింపులపై కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 31లోగా ఇంటి పన్నులను చెల్లించి వడ్డీ మినహాయింపు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.వాణిజ్య, వ్యాపార వర్గాలకు అవగాహన కల్పించాలని, పెద్ద మొత్తంలో పాత పన్నులు కూడా చెల్లించని వారికి నోటీసులివ్వాలని కమిషనర్ ఆదేశించారు.

చెత్తను తొలగించండి

శ్రీకాకుళంలోని ఆదివారంపేట, తురాయిచెట్టు వీధి, కనకదుర్గ గుడి, వాంబే కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలపై వచ్చిన ఫిర్యాధుల మేరకు శుక్రవారం కమిషనర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిపై మండిపడ్డారు. డ్రైనేజ్ అవుట్‌లెట్ల వద్ద చెత్తను తొలగించాలని పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పి.గణపతి,పి.సుగుణాకర్ తదితరులు ఉన్నారు.

రిజర్వ్ స్థలాల్లో పార్కులు నిర్మించండి

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో గల రిజర్వ్‌స్థలంలో పార్కులు నిర్మించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు గంగుశ్రీదేవి, నాయకులు సాధు కిరణ్‌కుమార్, పురుషోత్తం, అప్పారావు కోరారు.ఈమేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థలోని పలు సమస్యలపై కమిషనర్ తమీమ్ అన్సారియాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆర్ట్సుకళాశాల రోడ్డులో ఆర్చ్‌నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. ఈ రోడ్డులో ఆర్చి నిర్మాణం జరగడం వల్ల 100 అడుగుల రోడ్డు 50 అడుగులకు తగ్గిపోతుందని కమిషనర్‌కు బీజేపీ నాయకులు వివరించారు. వేసవి సమీపిస్తుండడంతో తాగు నీటి సమస్య తలెత్తకుండా సబ్ సర్ఫేస్ డైక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

చిన్నకర్రివానిపాలెంలో శివపంచాక్షరీ పూజలు


చిన్నకర్రివానిపాలెంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కవిటి: మండలంలోని చిన్నకర్రివానిపాలెం కాశీవిశ్వనాథాలయంలో శుక్రవారం సామూహిక శివపంచాక్షరీ పూజలను నిర్వహించారు. శివమాలాధారణ చేసిన స్వాముల ఆధ్వర్యంలో 100 మంది మహిళ పూజలు చేపట్టారు. పూర్ణకుంభాలను ప్రతిష్ఠించి స్వామి వారికి ప్రత్యేక కుంకుమార్చనలు ఏశారు.

పొందురులో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

పొందూరు: పొందూరులో అయ్యప్పస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం శుక్రవారం ప్రధాన అర్చకులు కూనపులి గిరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పట్టణానికి చెదిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల, పెద్దపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఇంటర్‌ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు పెన్నులు, పెన్సిల్స్, కిట్లు తదితర పరీక్ష సామగ్రిని శుక్రవారం జిల్లాపేరెంట్స్ కమిటీ, ఏఐఎం ప్రతినిధులు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా పేరెంట్స్ కమిటీ ప్రతినిధి ఏఐఎం నియోజకవర్గ కన్వీనర్ నేతల అప్పారావు, ఏఐఎం జిల్లా ప్రతినిధులు సుంకు రమణ, పురుషోత్తం, రాంబాబు, పట్నాన మహేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

● జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పీఎస్ఎస్ ప్రసన్నలక్ష్మి

కలెక్టరేట్: రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహణకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై పూర్తి అవగాహన అవసరమని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పీఎస్ ఎస్.ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో సాధారణ ఎన్నికలు- 2024కు సంబంధించి ఈఆర్వోలు, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ సిబ్బందికి ఎన్నికలనియమావళి సిబ్బంది, అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రవర్తనా నియమావళిని తూచాతప్పకుండా పాటించాలన్నారు.ఫ్లయింగ్‌స్క్వాడ్స్ అప్రమత్తంగా ఉండి ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించాలన్నారు.కార్యక్ర మంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట్రామన్, డీఐపీ పీఆర్వో చెన్నకేశవరావు, మోడల్ ఆఫీసర్ ఎన్.బాలాజీ పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

గుజరాతీపేట: సందేశ్‌ఖలీ ఘటనపై బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు డిమాండ్‌చేశారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఏడు కూడలిలో సందేశ్‌ఘటనపై నిరసన వ్యక్తంచేస్తూ మానవహారం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలను అరికట్టని షేక్ షాజహాన్‌ను అరెస్ట్‌చేసి శిక్షించాలన్నారు. ఈఘటనపై పూర్తి బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి, విడుదలచేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, నాయకులు పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జి, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, పాతిన గడ్డెయ్య, పేడాడ సూరపునాయుడు, ఎస్.వెంకటేశ్వరరావు, గురుగుబెల్లి వెంకటరావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలి

కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటుచేయాలని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ కోరారు. ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. కార్యక్రమంలో డీఈవో వేంకటేశ్వరరావు, లియాఖత్ ఆలిఖాన్, బి.మీనాక్షి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు ఫోన్ ఇన్‌లైవ్‌లో జరిగే కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అకడమిక్ సంబంధించి సందేహాల నివృత్తికి 8247861919 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

6న గార మండల సమావేశం

గార:గార మండల పరిషత్‌ల్ సర్వసభ్య సమావేశం ఈనెల ఆరో తేదీన ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు.అధికారులు పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఏడో తేదీలోగా వడ్డీ చెల్లించాలి

కంచిలి: స్థానిక పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు ఈనెల ఏడో తేదీలోగా ఏడు శాతం వడ్డీతో చెల్లించాలని ఆ సంఘ సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీ చెల్లించని రుణగ్రస్తులు 13శాతం వడ్డీతోపాటు అసలు సైతం చెల్లించాల్సిఉంటుందని పేర్కొన్నారు.

టెట్‌కు 362 మంది హాజరు

ఎచ్చెర్ల: మండలంలోని రెండు కేంద్రాల్లో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) 362 మంది హాజర్యయ్యారు. శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 182 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్‌కళాశాల (ఎచ్చెర్ల)లో 199కు 180 మంది హాజరయ్యారు. ఈనెల ఏడో తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పీజీ మొదటిసెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈపరీక్ష కేంద్రాల్లో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని,వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పరిశీలించారు. కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆమెఆదేశించారు.కాగా మొదటి రోజు జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి పరీక్షలో సైన్స్ కోర్సులకు 370కి 356 మంది, ఆర్ట్స్ కోర్సులకు 171కు 139 మంది హాజరయ్యారు. ఈ నెల 12వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి.

అన్నంపేటలో దివ్యజీవన సత్సంగం

బూర్జ: మండలంలోని అన్నంపేటలో పి.రవి ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త, సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

సరుబుజ్జిలి: కొండవలసలో గ్రామ సచివాలయం, షలంత్రిలో ఆర్బీకే భవనాలను శుక్రవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీజీ సత్యనారాయణ,జడ్పీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ● **పొందూరు:**లోలుగులోగడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో స్పీకర్ సీతారాం, సర్పంచ్ ధనలక్ష్మి, జడ్పీటీసీ కాంతారావు పాల్గొన్నారు.

బస్సుషెల్టర్ పనులు..

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించనున్న శివాలయ ప్రహరీ పనులకు జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎస్‌పల్లి మోడల్ పాఠశాలలో ఏడు గదులు, నారాయణబట్టిలో బస్‌షెల్టర్ నిర్మాణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్ రెడ్డి, వజ్జ మృత్యుంజయం, కొనపల సురేష్, లడ్డుకేశవ్‌పాత్రో పాల్గొన్నారు.

శివరాత్రికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: మహాశివరాత్రి ఈనెల ఎనిమిదో తేదీన పురస్కరించుకుని ఉమారుద్రకోటేశ్వరాలయం ఏర్పాట్లుచేస్తున్నట్లు ఆలయ ఈవో మునగవలస సుకన్య తెలిపారు. భక్తులకు షామియానాలు, మంచినీరు, ఉచిత ప్రసాదం, క్యూలైన్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు, పోలీస్ బందోబస్తు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో తెలిపారు.కాగానక్కవీధిలోఉన్న ఉమాజలేశ్వరాలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని ఈనెల ఆరు నుంచి పదోతేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శివ తెలిపారు.


వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేసే రోజులు దగ్గరపడ్డాయి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి, మార్చి 1: రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ అంతానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం వేములాడ విశ్వనాథపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక, మైనింగ్, ల్యాండ్ మాఫియాలకు పెద్ద పీట వేశారని, దొరికింది దొరికినట్లు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు దోచుకున్నారని విమర్శించారు. మద్యం, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజల్, గ్యాస్ ధరలు పెంచడంతో పాటు విద్యుత్ చార్జీలు తొమ్మిదిసార్లు పెంచి అన్ని వర్గాల ప్రజలను వంచించారన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, బెదిరించేందుకే ఈ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన వైసీపీ ని రానున్న ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలపాలని కోరారు. టీడీపీ-జనసేన కూటమి 160 సీట్లు సాధించడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను మహిళలకు వివరించారు. అనంతరం పలు వైసీపీ కుటుంబాలు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, వెలమల విజయలక్ష్మి, పైల సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

టీడీపీ అధికారంలోకి రాగానే చేనేత కార్మికులను ఆదుకోవాలని శాలివాహన కోపరేటివ్ స్పిన్నింగ్ మిల్స్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆ సంఘ అధ్యక్షుడు మంచు కృష్ణారావు, డైరెక్టర్ కూసెట్టి కాంతారావు నిమ్మాడలో అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షే మాన్ని గాలికొదిలేసిందని వారు విమర్శించారు.



టెక్కలి: కోటపాడు నుంచి టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుఅచ్చెన్నాయుడు

వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరిక

సంతబొమ్మాళి మండలం కోటపాడుకు చెందిన పది వైసీపీ కుటుంబాలు శుక్రవారం నిమ్మాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, ఐదేళ్లలో వైసీపీ అభివృద్ధి, సంక్షేమం గాలికొదిలేసిందని, అందుకే తామంతా వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామని గిన్ని రామారావు, చాట్ల భీమారావు తెలిపారు. వీరితో పాటు ఇప్పిలి కృష్ణా రావు, ఎల్.సుధీర్, రాపర్తి చిన్నారావు, దువ్వ రమేష్ తదితరులకు అచ్చెన్నాయుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లమ్మత రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడాలి

నరసన్నపేట: వైసీపీ నాయకుల అరాచకాలకు చరమగీతం పాడాలని, రానున్న ఎన్నికల్లో వారిని ఓడించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం సత్యవరం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలకు ముందు మాయమాటలు చెబుతూ వస్తారని, వారి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును మళ్లీ సీఎంగా చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటారన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ● **జలుమూరు (సారవకోట):** టీడీపీ-జనసేన ఉమ్మడిగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని నియోజకవర్గం ఐటీడీపీ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. నౌతల గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురవరపు దేవరాజు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



సత్యవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బగ్గు రమణమూర్తి



నౌతలలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న తిరుపతిరావు

జగనన్న గృహాలతో పేదలు అప్పులపాలు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస: జగనన్న గృహాలు ఉచితంగా ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించిందని, వాస్తవానికి ఒక్కో గృహానికి రూ.5 లక్షల వరకు పేద లబ్ధిదారులు అప్పులపాలయ్యారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ కార్యాలయం నుంచి లేఖ విడుదల చేశారు. ఏడాదికి ఐదు లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లను ఉచితంగా ఇస్తామన్న సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సెంటు భూమిలో గృహ నిర్మాణం చేసుకోవాలని, వాటి మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడంతో నిరుపేదల ఆశతో ఇళ్ల నిర్మాణం చేశారని, అయితే వాస్తవానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మెటీరియల్‌తో సహా ఇస్తే లబ్ధిదారుడికి అదనంగా రూ.5 లక్షల వరకు ఖర్చయిందన్నారు. అంత మొత్తాన్ని వడ్డీలకు తీసుకు వచ్చి వారంతా అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు చొప్పున భూమి ఇస్తే దానిని వైసీపీ ప్రభుత్వం సెంటుకు కుదించి అందులో కూడా చేతివాటాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 12.56 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడతామని ఆ లేఖలో పేర్కొన్నారు.

చల్లారని అసంతృప్తి జ్వాలలు

● పాతపట్నం నియోజకవర్గ సమావేశానికి వైసీపీ నేతల గైర్హాజరు

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గంలో అసంతృప్తి జ్వాలలు చల్లారడం లేదు. తాత్కాలికంగానైనా వీటిని చల్లార్చేందుకు ఆ పార్టీ అధిష్ఠానం రంగంలోకి దిగింది. విజయనగరం జడ్పీ చైర్మన్, వైసీపీ ఏరియా డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీను శుక్రవారం పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అసమ్మతి నాయకులను బుజ్జగించేందుకు ఈ సమావేశం నిర్వహించినా.. బహిరంగంగానే రెడ్డి శాంతి మాకొద్దు అని భీష్మించుకుని కూర్చున్న అనేక మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకాలేదు. కొత్తూరు మండల ఉపాధ్యక్షుడు తులసీవర ప్రసాద్, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ వర్గం ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. అలాగే కొత్తూరు, హిరమండలం ఎంపీపీలు సవర సావిత్రి, తూలుగు మేనక, ఎల్ఎన్‌పేట, పాతపట్నం జడ్పీటీసీలు కిలారి త్రినాథరావు, లింగాల ఉషారాణి, మెళియాపుట్టి వైస్ ఎంపీపీ తులసీవరప్రసాద్ గైర్హాజరయ్యారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ విక్రాంత్, శ్రీకాకుళం పార్లమెంటరీ వైసీపీ ఇన్‌చార్జి తిలక్ పాల్గొన్నప్పటికీ స్థానిక వైసీపీ నేతలు ఎక్కువ మంది హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఇక్కడ పార్టీ నేతల్లో ఏర్పడిన అశాంతిని చల్లార్చడమన్నది వైసీపీ నాయకులెవరితరం కాదన్న సంకేతాలు కనిపించినట్లు గుసగుసలు వినిపించాయి.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ తీసుకోండి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేకావసరాల పిల్లల ఆరోగ్యం మెరుగుపరి చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భవిత రాష్ట్ర మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్.అమ్మినాయుడు కోరారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో నైపుణ్యాలను పెంపుదించేందుకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్ బి. గోవిందరావు, వి.ఉమ, ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు, హెచ్‌ఎం వెంకట్రావు పాల్గొన్నారు.

అఖిల భారత సదస్సుకు 'భమిడిపాటి'

నరసన్నపేట: అమెరికాకు చెందిన వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఈనెల 9న జరగనున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు నరసన్నపేటకు చెందిన రచయిత భమిడిపాటి గౌరీశంకర్‌కు ఆహ్వానం వచ్చింది. ఈయన రచించిన 'శిల్పం' కథ ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక అయినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం

సంతబొమ్మాళి: క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని గొదలాం వీరాంజనేయ వ్యాయామ మండలి కోచ్ పిలక ధనుంజయకుమార్ అన్నారు. గొదలాంలో నందెమ్మ తల్లి ఆలయ 56వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీలో 16 జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీకి రిఫరీలుగా గవరయ్య, శివాజీ, లచ్చయ్య ప్రసాద్, నారాయణ, మల్లేసులు వ్యవహరిస్తున్నారు.

రూ.35 వేలు వేతనాలందించాలి

పలాస: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీవో 549 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆలిండియా మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకురాలు పడాల జ్యోతి మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా వేతనాలు మాత్రం గతంలో ఇస్తున్న విధంగానే ఇవ్వడం దారుణమన్నారు. కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

పాతపట్నం: జాతీయ లోక్‌అదాలత్‌ను ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ తెలిపారు. స్థానిక కోర్టుప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీకి తగ్గ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని, ఈ దిశలో కక్షిదారులకు అవగాహన కలిగించాలనికోరారు.



మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి హరిప్రియ

ఖాళీ స్థలాన్ని గిరిజన సంఘాలకు ఇవ్వొద్దు

జలుమూరు (సారవకోట): మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ పరిషత్ భవనం పక్కన ఖాళీగా ఉన్న స్థలాన్ని గిరిజన సంఘ నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, వారికి ఈ స్థలాన్ని ఇవ్వవద్దని మండల దళిత సంఘం అధ్యక్షుడు ఎ.దాలయ్య తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందించారు. ఈ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అయితే ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో గిరిజన సంఘ నేతలు ఎవరినీ సంప్రదించకుండా ఎమ్మెల్యే అప్పజెప్పారని ఆ స్థలాన్ని యంత్రంతో చదును చేయించడం దారుణమన్నారు. మా అధీనంలో ఉన్న స్థలాన్ని గిరిజనులకు ఇస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఘనంగా వాసుదేవుని వాహన సేవలు

మందస, మార్చి 1: మందసలోని వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ వాహనాల సేవలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత, ప్రాతఃకాల సేవ, నివేదన, ధ్వజారోహణ, హోమం, విశేష పూజల అనంతరం వాసుదేవ పెరుమాళ్ ఉత్సవ విగ్రహాలను హనుమ, శేష వాహనాలపై వేంచేపు చేసి తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి సేవలో పాల్గొని తరించారు. మహేంద్ర కళామండలి సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు.



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

నేటి కార్యక్రమాలివే..

వాసుదేవుని బ్రహ్మోత్సవంలో నాలుగోరోజు పొన్న చెట్టు, అశ్వ వాహన సేవలతో పాటు తెప్పోత్సవం నిర్వహిస్తున్నారు. అలాగే కళాకారులచే కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం

గంటపేట(పోలాకి): పోలాకి పంచాయతీ పరిధి గంటపేటలో అసిరితల్లి 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జిరమణమ్మ, లక్ష్మీనారాయణ, తూలుగు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులను జమచేయాలి

నందిగాం: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం డబ్బులను వెంటనే జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ప్రకటించిన ప్రభుత్వం 50 రోజులైనా నేటికీ జమ చేయకపోవడం అన్యాయమన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆర్భాటంగా ప్రకటనలు చేసిన పాలకులు డబ్బులు చెల్లింపులో జాప్యం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు బగాది వాసుదేవరావు, మండల ప్రతినిధి పాలిన సాంబమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

నందిగాం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని డీఎల్పీవో ఐవీ రమణ సూచిం చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పంచాయతీల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

పలాస: నిరుపేదలకు సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన విద్యార్థులు ఆహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. తాము పొదుపు చేసిన నగదుతో ఈ కార్యక్రమం చేపట్టారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న యాచకులకు ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, చైర్మన్ మల్లా రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ఈదులవలస(పోలాకి): ఈదులవలస మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి ఐదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హుల న్నారు. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ రూ.150 చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఈదులవలస మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తా మన్నారు. ఇతర వివరాలకు 80082 82009, 96527 30073 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆశ్రమానికి అనాథ వృద్ధుడి తరలింపు

పలాసరూరల్: తర్లాకోట బస్టాండ్ ఆవరణలో వారం రోజులుగా తిండి లేక పడి ఉన్న వృద్ధుడికి ముస్లింకాలనీ వాసులు భోజనం పెట్టి ఆదుకున్నారు. కాగా శుక్రవారం ఆ వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గ్రీన్‌ఆర్మీ ప్రతినిధి బోనెల గోపాల్ ఆధ్వర్యంలో ఆహారం పెట్టి, మందులు అందజేశారు. అనంతరం కోసంగిపురం సమీపంలో ఉన్న వృద్ధాశ్రమానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరాదరణకు గురవుతున్న వ్యక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ సభ్యులు సయ్యద్ హుస్సేన్, కార్యదర్శి బీటీ రావు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడిని ఆశ్రమానికి తరలిస్తున్న దృశ్యం

మహాశివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

జలుమూరు: శ్రీముఖలింగంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత, ప్రత్యేక దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లుతో పాటు ఎండ తగలకుండా షామియానాలను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. 8న మహాశివరాత్రి జాగారం, 9నపడియా, 10న మహాపడియా, 11న చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై నౌపడ స్టేట్‌బ్యాంక్ అధికారులు దాశరధి గంగరాజు, బాలకృష్ణ శుక్రవారం అవగహన కలిగించారు. సైబర్, ఓటీపీ, చిట్‌ఫండ్ కంపెనీ మోసాలు వాటి నుంచి బయటపడే విధానం, అటల్ పింఛన్ యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉప ఖజానా కార్యాలయ భవనం ప్రారంభం

పలాసరూరల్: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఉప ఖజానా కార్యాలయ భవనాన్ని శనివారం ప్రారంభించనున్నారు. ఈ భవనాన్ని మంత్రి అప్పలరాజు ఉదయం ప్రారంభిస్తారని సబ్‌ట్రెజరీ అధికారి రామారావు తెలిపారు. రూ.1.8 లక్షలతో ఈ భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను విస్మరించింది

వజ్రపుకొత్తూరు: వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను విస్మరించిందని, టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో మత్స్యకారులు కలిసి మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ పథకాలు కూడా వైసీపీ వారికే అందించారని, అర్హులున్నప్పటికీ కొందరిని తొలగించారన్నారు. దీనిపై శిరీష మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుల్ల చిన్నారావు, అంబటి రామకృష్ణ, గోవిందు పాపారావు, వంక రామారావు పాల్గొన్నారు.



గౌతు శిరీషతో మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో ఆక్రమణలను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'అడిగేదెవరు.. ఆపేదెవరు' అనే శీర్షికతో వచ్చిన కథనానికి జేసీ నవీన్ స్పందించారు. ఆక్రమ ణలపై నివేదిక పంపాలని తహసీల్దార్ జానకమ్మను ఆదేశిం చారు. ఈ నేపథ్యంలో ఆమె మెళియాపుట్టి, టెక్కలి రోడ్డులో ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయ నున్నట్లు ఆమె తెలిపారు. ఎవరైనా ఆక్రమణ లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



టెక్కలి-మెళియాపుట్టి రోడ్డులో ఆక్రమణలు తొలగించిన దృశ్యం

ఓపీఎస్ పునరుద్ధరించాలి

● కరపత్రం ఆవిష్కరిస్తూ నూతన దంపతుల నిరసన

నరసన్నపేట: దేవాది గ్రామంలో ఓ పెళ్లి మండపంలో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యుడు జగదీష్ హారిక దంపతులు పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ కర పత్రాలను ఆవిష్కరించి నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. పెన్షన్ ఉంటేనే నూతన దంపతులకు భరోసా ఉంటుందని, అందువల్ల సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేవరకు వివిధ రీతుల్లో నిరసనలు తెలుపుతామని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో సంఘ నాయకులు చౌదరి రవీంద్ర, కె.వైకుంఠరావు, కె.దాలయ్య, బి.రవికుమార్, జి.నారాయణరావు, కె.గణపతి, పి.ఉమాభాస్కర్, రాజేష్, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



ఓపీఎస్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నూతన దంపతులు జగదీష్ హారిక, యూటీఎఫ్ ప్రతినిధులు

'ఓట్ ఫర్ ఓపీఎస్' పుస్తకావిష్కరణ

టెక్కలి: సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని చాకిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని విధాలా నష్టం వాటిల్లిందని, డీఏలు, ఇతర అల వెన్స్‌లు పెండింగ్‌లో పెట్టేశారని ఆ సంఘ నాయకులు ఆరోపించారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం అనూరాధ, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దాలయ్య, టి.వైకుంఠరావు, టి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అభివృద్ధికి ఆకాశమే హద్దు

● సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ ఆర్ఎం డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు

టెక్కలి, మార్చి 1: ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థి అభివృద్ధికి ఆకాశమే హద్దు అని భారత మంత్రిత్వశాఖ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు అన్నారు. శుక్రవారం రాత్రి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం చదవడం ద్వారా కొత్త కొత్త అంశాలను తెలుసుకోవచ్చన్నారు. మాతృభాష తెలుగుతో పాటు ఇతర భాషలను నేర్చుకోవాలన్నారు. ఇన్ఫినిటీ నెట్‌వర్క్ సొల్యూషన్ సీఈవో రాహుల్ రాఘవేంద్ర మాట్లాడుతూ.. యువశక్తిని సంఘటితం చేయాలని, ఒక మంచి కోసం ఆలోచిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థినీ విద్యార్థులు వివిధ గీతాలకు డ్యాన్సులు చేయడంతో పాటు పలువురు విద్యార్థినులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టు కున్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కోశాధికారి నాగరాజు, కన్వీనర్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డాక్టర్ బిజయ్‌కుమార్, విద్యార్థినుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన

వేసవి తాపాన్ని అధిగమించాలి: కలెక్టర్

ఒడిశా

పర్లాకిమిడి: వేసవి తాపాన్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్మరంజన్ ప్రధాన్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రానున్న వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై అధికా రులకు సూచనలు చేశారు. జిల్లా వైద్య విభాగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండల్లో తిరగ వద్దని అవగాహన కలిగించాలన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్లు బాగులేవంటూ నిరసన

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం పర్లాకిమిడి గాంధీ జంక్షన్‌లో నిరసన తెలిపారు. అటల్ పార్క్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్ల బాగులేకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

జలుమూరు: జాతీయ పల్స్‌పోలియోలో భాగంగా ఈ నెల 3న మండలంలో చేపట్టనున్న కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ కోరారు. పీహెచ్‌సీ పరిధిలో 2,843 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 18 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలను కోరారు.